WWW.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక



ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

23-10-2025

## కొండరెడ్ల గ్రామాభివృద్ధికి ఐటిడిఎ పిఓ రాహుల్ కృషి



మండల పరిదిలోని పూసుకుంట కొండ రెడ్ల గ్రామాలలోని గిరిజన కుటుంబాలకు జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఐటీడీఏ ద్వారా సరఫరా చేసిన టిల్లర్లు తేనెటీగల పెంపకం సంబంధించిన బాక్సులు సక్రమంగా సద్వినియోగం చేసుకొని గ్రామం అభివృద్ధికి కావలసిన మౌలిక వసతుల కల్పనకు చేయూత అందిస్తామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.

09



05

## మా భూముల మాకే కావాలి

మా భూములు మాకే కావాలని, జీవనో పాధితో పాటు పిల్లల చదువుకు ఉప యోగపడుతున్న భూముల ను దేవుని ఆలయం పేరుతో బలవంతంగా లాక్కోవ టం సరైంది కాదని ఖమ్మం అర్బన్, దంసలాపురం రెవిన్యూ, 15వ డివిజన్ అల్లిపురంకు చెందిన దళిత రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.



06

## అత్యాధునిక వసతులతో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ

**ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ వీసీ విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణాతో మంత్రి తుమ్మల భేటీ**

దేశంలోనే తొలి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని కొత్తగూడెంలో అత్యాధునిక వసతులతో నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠమైన ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సెక్రటేరియట్‌లో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్, విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణాతో సమావేశమయ్యారు.



08

## పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికాబద్ద చర్యలు

**రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డా. యోగితా రాణా**

మధిర నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి పకడ్బందీ కార్యాచరణ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డా. యోగితా రాణా అన్నారు. విద్యాశాఖ కార్యదర్శి, విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్‌తో కలిసి హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మధిర నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధి పై సమీక్షించారు.



02

- సాయంత్రానికి చెక్ పోస్టులకు లాక్
- అశ్వారావుపేట, పాల్వంచ సహా జిల్లాలోని చెక్ పోస్ట్ లకు తాళాలు
- అశ్వారావుపేట ఆంధ్ర-తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్ట్ సాయంత్రం 5 గంటలకు మూసివేత
- ఇకపై అన్ని తనిఖీలు, అనుమతులు ఆన్‌లైన్‌లోనే

# చెక్‌పోస్టులకు చెక్

## సీఎం రేవంత్ సంచలనం



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయంతో చెక్ పోస్టులకు చెక్ పడింది. సీఎం ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెక్ పోస్టులను తక్షణమే మూసివేయాలని నిర్ణయించారు. ఆదేశాల ప్రకారం బుధవారం సాయంత్రం 5 గంటలకు అశ్వారావుపేట ఆంధ్ర-తెలంగాణ సరిహద్దు వద్ద ఉన్న రవాణా శాఖ చెక్‌పోస్ట్‌ను అధికారికంగా మూసివేశారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారులు, సిబ్బంది చెక్‌పోస్ట్‌లోని రికార్డులు, కంప్యూటర్లు, ఫర్నీచర్, పరికరాలను జిల్లా రవాణా కార్యాలయానికి తరలించనున్నట్లు తెలిపారు.

అశ్వారావుపేట, మహా

# డ్రగ్స్‌పై యుద్ధం

- మణుగూరులో ఆర్టీసీ ప్రయాణికులకు అవగాహన..
- డి.ఎస్.పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సోదాలు..

**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని సురక్ష బస్టాండ్ ప్రాంతంలో డ్రగ్స్ పై యుద్ధం కార్యక్రమంలో భాగంగా బుధవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని పాన్ షాపులు, కూల్ డ్రింక్ షాపులలో, బస్టాండులో సోదాలు నిర్వహించారు. బస్టాండ్ లో ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులకు మత్తు పదార్థాల ప్రమాదకర ఫలితాలపై అవగాహన కల్పిస్తూ, వాటి వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతోందని హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం, విక్రయం, రవాణా నేరమని, ఇలాంటి చర్యలపై ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ దుష్పరిణామాలను ప్రయాణికులకు వివరించారు. గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు సంఫరా చేసే వ్యక్తులను ఎలా గుర్తించవచ్చో ప్రయాణికులకు సూచనలు అందించారు. తోటి ప్రయాణికుల్లో ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే వారిని అజ్ఞాతంగా సమాచారమిచ్చే విధానం గురించి వివరించారు. డ్రగ్ ఫ్రీ సమాజం కోసం అందరూ కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా డిఎస్పి రవీందర్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఇన్ చార్జి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై నగేష్, పోలీస్ సిబ్బంది మురారి తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం

**ఖమ్మం సిటీ, మహా:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్ అసోసియేషన్ సభ్యుడు వెంకటేష్ ని సంఘ సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకోవాలని ఆ కాంక్షిస్తూ, సంఘం తరపున రూ .5,000లను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని సంఘం గౌరవ సలహాదారుడు అదాలత్ నరేందర్ సలహా మేరకు, సంఘం అధ్యక్షుడు నువ్వు నావత్ కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎస్.కే. జానీ పాషా, వెంపటి వెంకటేశ్వర్లు, అంజి బాబు, గిరి, ఆకుల సైదులు, నామాల నరసింహారావు, గోవింద భద్రం తదితరులు పాల్గొన్నారు.



## పశువులకు సకాలంలో టీకాలు పంపిణీ చేయాలి

**ముదిగొండ, మహా:** గాలికుంటు నివారణ టీకాలు పశువులకు సకాలంలో పంపిణీ చేయాలని పశువైద్య,పశు సంవర్ధక జిల్లా అధికారి డాక్టర్ బోడేపూడి శ్రీనువాసరావు అన్నారు. మండలంలోని పమ్మి,సువర్ణాపురం,న్యూలక్ష్మీపురం గ్రామాలలో పశువైద్య,పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గాలికుంటు నివారణ టీకాల పంపిణీ శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన పశువులకు పంపిణీ చేసిన టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని,పశు పోషకలు తప్పనిసరిగా టీకాలను వేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ పి అశోక్. ఇందిరా మహిళా డైయిరి ఏపిఎం లక్ష్మణరావు,ఐకెపి ఎపిఎం డి సత్యనారాయణ, సువర్ణాపురం వివోఎ పసుపులేటి ఉమ,పశువైద్య సిబ్బంది గోపాలమిత్రులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకి పొంగులేటి శీనన్న ఆత్మీయ భరోసా

**కూసుమంచి, మహా:** కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవలే మృతి చెందిన మృతుల కుటుంబాలకు రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు పొంగులేటి ఆత్మీయ భరోసా ను అందజేశారు. మండలంలోని, మునిగేపల్లి, అగ్రహారం, నేలపట్ల, గట్టుసింగారం, రాజుపేట, నాయకన్ గూడెం, పాలేరు, బోజ్యతండా, కూసుమంచి, గంగబండ తండా, బొడమీద తండా, జీళ్ళచేరువు, చింతల తండా, కొత్త తండా, చేగొమ్మ, ముత్యాల గూడెం, పోచారం, బోడియ తండా , పుర్యాతండా, చింతాల తండా, గ్రామాల్లో వివిధ అనారోగ్య కారణాలతో మరణించిన 40 కుటుంబాలకు పొంగులేటి శ్రీనన్న ఆత్మీయ భరోసా కింద రూ.10,000ల చొప్పున కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.



## పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**కూసుమంచి, మహా:** అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ముఖ్యంగా పత్తి చేల రైతులు కౌల రైతులు లకు పంటపై పెట్టిన పెట్టుబడి రాకపోగా నష్టాల బారిన పడే అవకాశం ఉందని వెంటనే ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మాతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని జుజ్జుల్ రావుపేట, గట్టుసింగారం గ్రామాలలో రైతులతో కలిసి పత్తి పంటలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరుగాలం శ్రమించి పంటను పండిస్తుంటే వంట చేతికి వచ్చే దశలో అకాల వర్షాలతో భూములు మొత్తం ఊటలు పట్టి పత్తి పంట మొత్తం ఎర్రబారి పంట చేతికి రాకుండా చేలు ఆగమైపోయాయని ఈ పరిస్థితుల్లో రైతులను వ్యవసాయాన్ని కాపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు .అలాగే ముఖ్యంగా కౌలు రైతులు పరిస్థితి చాలా దారుణంగా ఉందని ఇటు పంట నష్టపోయి, కౌలు నష్టపోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమ లో తెలంగాణ రైతు సంఘం పాలేరు డివిజన్ అధ్యక్షులు బిక్కసాని గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు తోటకూరి రాజశేఖర్ పాల్గొన్నారు.



## వరికోతలను పరిశీలించిన అగ్రికల్చర్ అధికారులు

**కూసుమంచి, మహా:** కూసుమంచి మండలంలోని పెరికసింగారం గ్రామంలో బుధవారం వరి కోతలను జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోత సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. రైతులతో విత్తన రకం, దిగుబడి ఎరువుల వాడకం మొదలగు అంశాల గురించి చర్చించారు. అనంతరం కూసుమంచి గ్రామంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. డీలర్లు అందరూ ఎరువులు పురుగుమందులు, విత్తన చట్టాలకు లోబడి వ్యాపారం చేయాలని, లైసెన్స్ నందు పి.సీలు ఓ ఫామ్స్ ను పొందుపరచాలని సూచించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని సందర్శించి , రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, వ్యవసాయ విస్తరణాధికారులు నవీన్, రవీందర్, వంశీకృష్ణ, సౌమ్య, ప్రియాంక రైతులు పాల్గొన్నారు.



## అశ్వారావుపేట చెక్‌పోస్ట్‌కు లాక్!

**అశ్వారావుపేట, మహా :** తెలంగాణ రవాణా శాఖ కమిషనర్ కీలక ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెక్‌పోస్టులను తక్షణమే మూసివేయాలని నిర్ణయించారు. ఆదేశాల ప్రకారం బుధవారం సాయంత్రం 5 గంటలకు అశ్వారావుపేట ఆంధ్ర–తెలంగాణ సరిహద్దు వద్ద ఉన్న రవాణా శాఖ చెక్‌పోస్ట్‌ను అధికారికంగా మూసివేశారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారులు, సిబ్బంది చెక్‌పోస్ట్‌లోని రికార్డులు, కంప్యూటర్లు, ఫర్నీచర్, పరికరాలను జిల్లా రవాణా కార్యాలయానికి తరలించనున్నట్టు తెలిపారు. చెక్‌పోస్ట్ వద్ద ఉన్న బోర్డులు, బారికేడ్లు, సూచికలు, కంట్రోల్ షెడ్లు కూడా తొలగించారు. ఇకపై వాహన పన్నులు, డాక్యుమెంట్ తనిఖీలు, అనుమతులు, లైసెన్సులు వంటి ప్రక్రియలు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నిర్వహించబడతాయని వెల్లడించారు. రవాణా శాఖ ఇ–చెక్‌పోస్టులు, స్మార్ట్ ట్రాకింగ్ సిస్టమ్స్ ను అమలు చేయడానికి సిద్ధమవుతుండగా, ఈ నిర్ణయం పారదర్శకతను పెంపొందిస్తుందని, లంచాలు వంటి అవినీతి అంశాలను తగ్గించే దిశగా ఇది ఒక కీలక అడుగని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అశ్వారావుపేట చెక్‌పోస్ట్ వద్ద రవాణా శాఖ ఆదేశాల ప్రకారం సాయంత్రం ఐదు గంటలకు ముందుగానే అధికారులు సిబ్బంది కలిసి పరికరాల తరలింపును పూర్తి చేశారు. వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సిబ్బంది ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. డిజిటల్ మార్పుల దిశగా తెలంగాణ రవాణా శాఖ ముందడుగు వేసింది. ఇకపై రవాణా సేవలన్నీ స్మార్ట్ ట్రాకింగ్ సిస్టమ్స్' అమలు దిశగా అడుగులు వేస్తోంది. వాహనదారులు ఇకపై చెక్‌పోస్టులకు వెళ్లకుండానే అన్ని సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు.



## సీపీఐ నాయకులు తుడుం వీరస్వామి మృతి




**కూసుమంచి, మహా:** కూసుమంచి మండల పరిధిలోని, నేలపట్ల గ్రామానికి చెందిన, సీపీఐ గ్రామ శాఖ మాజీ కార్యదర్శి తుడుం వీరస్వామి అనారోగ్య కారణాలతో మంగళవారం రాత్రి మృతి చెందారు. పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న జాతీయ సమితి సభ్యులు, ఖమ్మం జిల్లా నిర్మాణ బాధ్యులు భాగం హేమంతరావు, పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ బుధవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి, ఎర్రజెండా కప్పి, పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు గుండెపోంగు మల్లేష్, మండల కార్యదర్శి భూక్యా నరసింహ, సహాయ కార్యదర్శి జిల్లా లింగయ్య, పార్టీ నాయకులు మర్రి వీరభద్రం, తుడుం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి



**ఖమ్మం,మహా:** పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల పురోగతిపై బుధవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జిల్లాలో 44 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి. హెచ్. రామకృష్ణ, ఎంపీడీఓలు, ఎం.ఈ.ఓ. లు, సంబంధిత పాఠశాలల హెడ్ మాస్టర్ లు, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

## స్థానికంలో సమన్వయంతో పని చేయాలి



**నేలకొండపల్లి, అక్టోబర్ 22 మహా :** స్థానిక సంస్థల ఎన్నికలలో సమన్వయంతో పని చేసి విజయాలు సాధించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు గుగులోత్ రూప్లానాయక్, నాగేశ్వరరావు తదితరులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో దయాకర్‌రెడ్డి సమక్షంలో చేరారు. వీరికి కండువా కప్పి సాదారంగా అహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, మంత్రి శ్రీనివాసరెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను పట్ల ఆకర్షితులై చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, రాజారాంపేట సొసైటీ చైర్మన్ బాలాజీ, చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, కోడాలి గోవిందరావు, గోబ్రియా, దుర్గారెడ్డి, శ్రీను, యర్రబోయిన నర్సయ్య, సీత్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కందాళ పర్యటన



**నేలకొండపల్లి, అక్టోబర్ 22 మహా:** పాలేరు మాజీ శాసన సభ్యులు కందాళ ఉపేందర్‌రెడ్డి బుధవారం మండలం లో వివిధ గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. మండలం లోని సదాశివాపురం, భైరవునిపల్లి, పైనంపల్లి, బుద్దారం, నేలకొండపల్లి తదితర గ్రామాలలో పర్యటించి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. పలువురు ఆశ్వీరదించారు. ఇటీవల మృతి చెందిన,పలు కుటుంబాలను పరామర్శించారు. అనంతరం కార్యకర్తలతో ప్రత్యేకంగా మాట్లాడారు...వివిధ సమస్యల పై చర్చించారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట కార్యాచరణ

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- పట్టణాలలో ప్రధాన రోడ్ల గుంతలను పూడ్చి వేయాలి
- వైరాలో రోడ్డుపై సీవరేజి రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి
- పాఠశాలల వద్ద స్కూల్ జోన్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు
- ప్రమాదాల నియంత్రణకు ఎన్‌హెచ్‌పై బ్లాక్ స్పాట్స్ గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి



**ఖమ్మం,మహా:** రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 8వ జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో స్థానిక మున్సిపాలిటీలు బాధ్యతలు తీసుకొని రోడ్ల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరంలో 10 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి రోడ్ల గుంతలను పూడ్చి వేయడం జరిగిందని తెలిపారు. రోడ్ల గుంతలు పూడ్చివేత నాణ్యతతో జరగాలని, సాంకేతిక విలువను తూ.చ. తప్పకుండా పాటించాలని అన్నారు. కల్లూరు, వైరా, సతుపల్లి, మధిర, ఏదులాపురం మున్సిపాలిటీల పరిధిలో ప్రధాన రోడ్లపై ఉన్న గుంతలను గుర్తించి 15 రోజులలో వాటిని పూడ్చి వేయాలని కలెక్టర్ ఆదేశించారు. నేషనల్ హైవే 365బిబి ఖమ్మం నగరానికి బైపాస్ సెక్షన్ గా ఉంటుందని, ఖమ్మం బైపాస్ వద్ద మరమ్మత్తు పనులు చేపట్టాలని, అక్కడ రోడ్డు భద్రత ప్రమాణాల క్రింద రంబుల్ స్ట్రిప్స్, రేడియం స్టిక్కర్, స్పీడ్ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి అక్కడ ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. నేషనల్ హైవే పై ఉన్న జంక్షన్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఖమ్మం –కోదాడ, వరంగల్ జంక్షన్ పరిధిలో ఉన్న స్ట్రెచ్ ను ఆర్ అండ్ బీ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. వైరా లో ఒక అపార్ట్ మెంట్ రోడ్డుపై సివరేజి వదలడం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవు తున్నాయని తెలుసుకున్న కలెక్టర్ వెంటనే సంబంధిత యాజమాన్యాలకు నోటిస్ జారీ చేయాలని, 15 రోజులలో అక్కడ యాజమాన్యం సొంత డబ్బులతో ఇంకుడు గుంత నిర్మించి, రోడ్డుపై సీవరేజి రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్సిపల్, ఎన్. హెచ్, రెవెన్యూ, పోలీస్, ఆర్ అండ్ బీ అధికారులు సంయుక్తంగా అక్టోబర్ 24న బైపాస్ నుంచి కలెక్టరేట్ వరకు ఫీల్డ్ విజిట్ చేపట్టి తీసుకోవాల్సిన చర్యలపై అక్టోబర్ 29 నాటికి రిపోర్ట్ అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణ ప్రాంతాలలో పాఠశాలల వద్ద ఉన్న రోడ్లపై స్కూల్ జోన్, గో స్లో రేడియం స్టిక్కర్లతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్లపై వాహనాల వేగం తగ్గించేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పాఠశాల గేట్ వద్ద వారి సిబ్బంది ఉంటూ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేయాలని అన్నారు.

## ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



**నేలకొండపల్లి, మహా:** ఈనెల 26వ తేదీన నూతక్కి గంగాధరరావు (ఎన్జీఆర్) ఫౌండేషన్, భక్త రామదాసు సర్వీస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో జరిగే ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్జిఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు కోరారు. బుధవారం స్థానిక రావెళ్ల సత్యనారాయణ భవనంలో ఎన్జీఆర్ ఫౌండేషన్, భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో వాతావరణ మార్పులతో పాటు కలుషిత ఆహారంతో ప్రజలు క్యాన్సర్ తో పాటు అనేక రోగాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు డాక్టర్ టి రాఘవేంద్ర రెడ్డి ఎంబిబిఎస్, డిఎం, (ఆంకాలజీ) ఎండి (రేడియేషన్ ఆంకాలజీ), డాక్టర్ ఎం శ్యామ్ ఎండి డిఎన్బి (ఎఫ్ఎం) పిజిడిసిసి డయాబెటాలజిస్ట్/ క్లినికల్, కార్డియాలజిస్ట్ వైద్య సేవలు అందిస్తారన్నారు. నేలకొండపల్లి మండలంతో పాటు పరిసర ప్రాంత ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో నోటి క్యాన్సర్ కోసం ఓరల్ స్క్రీనింగ్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్, క్యాన్సర్ రిస్క్ అసెస్మెంట్ స్కానింగ్, పాప్ స్మియర్ స్క్రీనింగ్ వంటి ఉచిత పరీక్షలతోపాటు డాక్టర్లు అవసరమైన వైద్య సేవలు అందిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9490098225, 9030897480, 9849612129, 9393772427 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

FOLLOW: @ANNTELUGU
23-10-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# గుంతలమయంగా రోడ్లు

- ప్రాణాలు పోయే దాకా పట్టించుకోరా?
- మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు
- ఇసుక, మట్టి దందాలపై పెట్టిన శ్రద్ధ రోడ్లపై పెట్టాలని మెచ్చా ఆవేదన
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడు లేడని ఆగ్రహం
- రోడ్డు మరమ్మతులు చేయకపోతే ధర్నాకు సిద్ధమంటూ హెచ్చరిక



**అశ్వారావుపేట/ములకలపల్లి, మహా :** అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ములకలపల్లి మండలంలో జరిగిన కార్యక్రమానికి వెళ్తున్న సమయంలో రోడ్ల దుస్థితిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంకం పాలెం దాటి అడవి ప్రాంతంలో అడుగ డుగునా గుంతలు కనిపించడంతో గంగారం వద్ద కారు ఆపి స్వయంగా పరిశీలించారు. అక్కడి ప్రజలతో మాట్లాడగా, గుంతల కారణంగా ప్రమాదం జరిగినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని వారు తెలిపారని, దీనిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగ కాంతారావు ఇచ్చిన గుంతలతో సెల్ఫీ పిలుపు మేరకు మెచ్చా నాగేశ్వరరావు గుంతలతో సెల్ఫీ తీసి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### గుంతలతో సెల్ఫీ ఉద్యమం

జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు ఇచ్చిన పిలుపుతో మెచ్చా నాగేశ్వరరావు గుంతలతో సెల్ఫీ తీసి రోడ్ల దుస్థితిని బయటపెట్టారు. ఈ చర్య స్థానికులలో చర్చనీయాంశంగా మారింది.

### ఇసుక, మట్టి దందాలపై పెట్టిన శ్రద్ధ రోడ్లపై పెట్టాలి: మెచ్చా

ఇసుక, మట్టి దందాలపై పెట్టిన శ్రద్ధ రోడ్లపై పెట్టాలి. 22 నెలలు అవుతున్నా తట్టెడు మట్టి పోసిన పాపాన పోలేదు. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. ప్రాణాలు పోయే దాకా చూస్తూ ఉంటారా? అని మండిపడ్డారు. బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో వేసిన రోడ్లే ఇప్పటికీ వినియోగంలో ఉన్నాయని, కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏ పనీ చేయలేదని విమర్శించారు. మా ప్రభుత్వం మంజూరు చేసిన పనులను కూడా గాలికి వదిలేశారు. ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు మళ్ళీ గెలవడం కష్టమని తెలిసి ప్రజల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గెలిపించిన ప్రజలు ఏమైపోతే మాకేం అన్న ధోరణితో అందరూ దోచుకునే పనిలో పడ్డారు అని అన్నారు. వెంటనే అంకంపాలెం అడవి నుంచి ములకలపల్లి వరకు రహదారి మరమ్మతులు చేపట్టకపోతే రహదారిపై ధర్నాకు సిద్ధమవుతాం అని హెచ్చరించారు.

### గుంతలతో నిండిన మార్గం.. ప్రమాదాలకే వేదిక

అంకంపాలెం-ములకలపల్లి రహదారి బీభత్సంగా ఉంది. వర్షాకాలం రాగానే గుంతలు మరింత లోతుగా మారి వాహనదారులు, విద్యార్థులు ప్రమాదాల ముప్పులో ప్రయాణిస్తున్నారు. స్థానిక ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా, అధికారులు స్పందించలేదని వాపోతున్నారు.



# మా భూముల మాకే కావాలి

- దేవుని పేరుతో జీవనోపాధి భూములు లాక్కోవడం అన్యాయం
- ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ వైఖరి మార్చుకోవాలి
- బలవంతంగా భూములు లాక్కుంటే మాకు సావే చరణ్యం
- విలేకరుల సమావేశంలో ఖమ్మం 15వ డివిజన్ అల్లిపురం దళిత రైతుల ఆవేదన





**ఖమ్మం, మహా:** మా భూములు మాకే కావాలని, జీవనోపాధితో పాటు పిల్లల చదువుకు ఉపయోగపడుతున్న భూములను దేవుని ఆలయం పేరుతో బలవంతంగా లాక్కోవటం సరైంది కాదని ఖమ్మం అర్బన్, దంసలాపురం రెవిన్యూ, 15వ డివిజన్ అల్లిపురంకు చెందిన దళిత రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దళితులు మాట్లాడుతూ... ఖమ్మం అర్బన్ ధంసలాపురం రెవెన్యూ అల్లిపురం 15వ డివిజన్లోని సర్వే నెంబర్ 408 లో 15 ఎకరాల భూమిని వారసత్వంగా 12 మంది దళిత రైతులు సాగు చేసుకుంటున్నామన్నారు. పేద, అణగారిన దళిత వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం గత 60 సంవత్సరాల క్రితం భూమిలేని నిరుపేదలకు భూములను కేటాయించిందని, వారసత్వంగా వస్తున్న ఆ భూములకు పట్టా, పాస్ పుస్తకాలు కూడా ప్రభుత్వం కేటాయించిందని తెలియజేశారు. అట్టి భూమి తప్ప మాకు వేరే భూమి లేదన్నారు. వారసత్వంగా ఆ భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధితో పాటు పిల్లలను చదివించుకుంటున్నామని అన్నారు. తిరుమల తిరుపతి దేవాలయం పేరుతో సాగు చేసుకుంటున్న మా భూములను స్థానిక ప్రజా ప్రతినిధులు లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ వైఖరిని మార్చుకొని దళితుల అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. సాగు చేసుకుంటున్న మా భూములను బలవంతంగా లాక్కుంటే మాకు సావే చరణ్యం అని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విలేకరుల సమావేశంలో గద్దల రాంబాబు, గద్దల వెంకటరమణ, కొండ అమేల్యమ్మ, బర్ల రవి, బర్ల ఫ్రాన్సిస్, జొన్నలగడ్డ లలిత, ఆమడాల రోజమ్మ బర్ల కోటేష్, షేక్ మీరాబి, మద్దె పుల్లమ్మ, పి లలితమ్మ, గొర్రెముచ్చు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో "నమస్తే" పథకం ప్రారంభం



**ఖమ్మం, మహా:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "నమస్తే" పథకంలో భాగంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వేస్ట్ పికర్స్ లెక్కింపు కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా నగరంలో అనధికారికంగా వ్యర్థాలు సేకరించే కార్మికులను గుర్తించి, వారిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే అధికారిక వ్యర్థ నిర్వహణ వ్యవస్థలో చేర్చనున్నారు. దీని ద్వారా వారికి గౌరవప్రదమైన జీవనోపాధి, సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం లభించనుంది. పథకానికి రాగ్ పికర్స్, వేస్ట్ కలెక్టర్లు, హెయిర్ కలెక్టర్లు, వేస్ట్ వాహన యజమానులు, డ్రైవర్లు వంటి వర్గాలు అర్హులు. లెక్కింపు తర్వాత ప్రతి వేస్ట్ పికర్‌కు అధికారిక గుర్తింపు కార్డు ఇవ్వబడుతుంది. ఈ పథకం కింద ఆరోగ్య బీమా కవరేజ్, సామాజిక సంక్షేమ పథకాల అనుసంధానం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఆర్థిక మద్దతు వంటి సౌకర్యాలు అందించబడతాయి. వేస్ట్ పికర్స్‌ను అధికారిక మెటీరియల్ రికవరీ సెంటర్లతో డ్రై వేస్ట్ కలెక్షన్ సెంటర్లతో అనుసంధానం చేసి, శుభ్రత సేవల్లో భాగస్వామ్యులను చేస్తారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**టేకులపల్లి - మహా:** టేకులపల్లి మండలం లో పర్యటించి పలు అభివృద్ధి పనులను శంకుస్థాపన చేసిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కొత్తూరు నుండి దార పాడు వరకు 50 లక్షలతో సిసి రోడ్ 15 లక్షలతో ముఖంపాడు ఏర్పాటుచేసిన అంగన్వాడి భవనాన్ని ప్రారంభించారు 13 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు





## ఆదివాసీ గౌరవానికి చిహ్నామే కొమరం భీమ్

**మణుగూరు, మహా:** విప్లవ వీరుడు, పోరాటయోధుడు కొమరం భీమ్ జయంతి వేడుకలు బుధవారం మణుగూరులో ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించిన ఈ వేడుకల్లో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొని కొమరం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీక, విప్లవ వీరుడు కొమరం భీమ్ అనే కొనియాడారు. ఆదివాసుల స్వయం ప్రతిపత్తే ధ్యేయంగా ఎగిసిన ఉద్యమబావుట, దేశానికి స్వాతంత్ర్యం రాకముందే జల్ జంగల్ జమీన్ నినాదంతో పోరాటం ప్రారంభించిన యోధుడు కొమరం భీమ్ అని పేర్కొన్నారు. భీమ్ తన తండ్రిని అటవీశాఖ సిబ్బంది దాడిలో కోల్పోయినా, ఆ దుఃఖాన్ని శక్తిగా మలుచుకొని నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొరిల్లా శైలిలో పోరాడారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, పినపాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు సౌజన్య, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, గాండ్ల సురేష్, మండల ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వర్తింపు



**మణుగూరు, మహా:** సింగరేణి కాలరీస్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కుటుంబ సభ్యులకు ఎస్ఐ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు మణుగూరు ఏరియా జియం దుర్గం రామచందర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎవరైనా సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆదేశాల మేరకు ఈనెల 23 24 తేదీలలో ఏరియా జిఎం కార్యాలయంలో కాంట్రాక్ట్ కార్మికులు ఈఎస్ఐ కార్డు కోసం దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తు తో పాటు సరైన గృహపాత్రాలను కలిపి ఇవ్వాలని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ వద్ద సుమారు పదిమందికి పైగా కాంట్రాక్టు కార్మికులు ఉండాలని నెలకు 21000 లోపల జీతం ఉండాలన్నారు. నాన్ మైనింగ్ కాంట్రాక్టు కార్మికులు కూడా ఈ పదానికి అర్హులే అన్నారు. ఈ అవకాశాన్ని కాంట్రాక్టు కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అత్యాధునిక వసతులతో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ

## సిఎస్ఆర్ నిధులతో ప్రాజెక్ట్ ముందుకు...

### ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ వీసీ విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణాతో మంత్రి తుమ్మల భేటీ





**భద్రాద్రి బ్యూరో, మహా:** దేశంలోనే తొలి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని కొత్తగూడెంలో అత్యాధునిక వసతులతో నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠమైన ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సెక్రటేరియట్‌లో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్, విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణాతో సమావేశమయ్యారు. యూనివర్సిటీ నిర్మాణ ప్రగతిపై చర్చించి, అవసరమైన సూచనలు చేశారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ కొత్తగూడంలోని మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా మార్చుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ విద్యా చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఇది భారతదేశంలో తొలి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కాగా, ప్రపంచంలో రెండోది మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మక ఈ విద్యాసంస్థకు మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు ఇవ్వడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం గౌరవప్రదమైన నిర్ణయం తీసుకున్నదని తెలిపారు.

### సదుపాయాలు కలిగిన క్యాంపస్ కావాలి

యూనివర్సిటీని అన్ని రకాల ఆధునిక మౌళిక సదుపాయాలతో భవిష్యత్ తరాలకు అనుగుణంగా రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, అధ్యాపకులు సౌకర్యవంతమైన వాతావరణంలో నేర్చుకునేలా తరగతి గదులు, హాస్టళ్లు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు నిర్మించాలన్నారు. యూనివర్సిటీ భవన నిర్మాణ రూపకల్పనను దేశంలోని అగ్రశ్రేణి ఆర్కిటెక్ట్‌ల ద్వారా రూపొందించి అంతర్జాతీయ ప్రమాణాలకు తగిన మోడల్‌గా తీర్చిదిద్దాలని సూచించారు.

### పీహెచ్ డి కోర్సులు వచ్చే ఏడాది నుంచే...

ప్రస్తుతం ఉన్న మైనింగ్ యూనివర్సిటీలో అండర్ గ్రాడ్యుయేట్(యూజీ)పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే పీహెచ్డీ కోర్సులు ప్రారంభించాలనే ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి)తో చర్చలు జరిపి అవసరమైన అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. ఈ యూనివర్సిటీ నుంచి భవిష్యత్ భూశాస్త్రవేత్తలు, ఖనిజ నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారుని తుమ్మల విశ్వాసం వ్యక్తం చేశారు.

### సిఎస్ఆర్ నిధులతో ప్రాజెక్ట్ ముందుకు..

ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన భారీ నిధుల సమీకరణ కోసం ఎన్ఎండిసి, సింగరేణి కోల్ ఇండియా సంస్థల ప్రతినిధులతో ఇప్పటికే చర్చించినట్లు మంత్రి తెలిపారు. వారి సిఎస్ఆర్ ఫండ్ ద్వారా యూనివర్సిటీకి నిధులు మంజూరు చేసేలా సమన్వయం జరుగుతోందన్నారు. వచ్చే వారంలో ముఖ్యమంత్రిని కలిసి యూనివర్సిటీ నిర్మాణ ప్రణాళిక, నిధుల అంశాలపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. అప్పటివరకు ఆర్కిటెక్ట్ డిజైన్‌లు ఖర్చు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

### భవిష్యత్ శాస్త్రవేత్తల కేంద్రం..

కొత్తగూడంలో 300 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబోయే ఈ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ, విద్యా-ఉపాధి రంగాల్లో నూతన దిశగా మారనుందని తుమ్మల అన్నారు. ఈ యూనివర్సిటీ తెలంగాణ విద్యా రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకు వెళుతుందన్నారు. ఇక్కడి నుంచి వేలాది మంది యువ శాస్త్రవేత్తలు తయారవుతారని ఇది తెలంగాణకు గర్వకారణం అవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

### నూతన యుగానికి నాంది...

ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపనతో తెలంగాణ విద్యా రంగం కొత్త మైలురాయిని అధిగమిస్తుందని మంత్రి పేర్కొన్నారు. భూశాస్త్రం, పర్యావరణం, ఖనిజ సంపదల వినియోగం, వాతావరణ మార్పులపై పరిశోధనలో ఈ యూనివర్సిటీ ప్రముఖ కేంద్రంగా నిలుస్తుందని మన భవిష్యత్ తరాలు ప్రకృతి వనరులను సంరక్షించేందుకు శాస్త్రీయ దృష్టికోణాన్ని అలవరుచుకుంటాయని తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

# కండక్టర్‌పై దాడిని ఖండించిన ఆర్టీసీ టీఎంయు దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి

**మణుగూరు, మహా:** భద్రాచలం బస్టాండ్‌లో విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ కండక్టర్ బి ఉమా మహేశ్వం౯రావుపై అల్లరి మూకలు చేసిన దాడిని తెలంగాణా మజ్దూర్ యూనియన్ ఖమ్మం రీజినల్ కమిటీ తీవ్రంగా ఖండిం చింది. దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని యూనియన్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా తెలంగాణా మజ్దూర్ యూనియన్ ఖమ్మం రీజినల్ కార్యదర్శి ఏ కృష్ణ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం విజయవంతం కావడంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర కీలకమని. ప్రజల రవాణా సౌకర్యం కోసం వారు ఎంతగానో కష్టపడుతున్నారన్నారు. పండుగ సీజన్‌లో డ్రైవర్లు, కండక్టర్లు అధిక పని భారంతో పాటు ప్రయాణికుల ఒత్తిడిని కూడా భరిస్తున్నారని, ఈ సమయంలో కొంతమంది ప్రయాణికులు ఓపిక కోల్పోయి వాగ్వాదాలకు, దాడులకు పాల్పడటం దురదృష్టకరమని అన్నారు. భద్రాచలం బస్టాండ్‌లో కండక్టర్ బి ఉమా మహేశ్వరరావుపై జరిగిన దాడి కూడా ఇలాంటి ఘటనలకే ఉదాహరణ అన్నారు. పాల్వంచ వద్ద ఫుట్‌బోర్డుపై నిలబడ్డ మహిళలను లోపలికి రండి లేదా దిగిపోండి అని హెచ్చరించినందుకు కేవలం తన విధి నిర్వహణ చేస్తున్న కండక్టర్‌పై దాడి చేయడం అత్యంత దారుణమ న్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఈ దాడిని ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్టీసీ సిబ్బంది గౌరవం కాపాడటంలో అందరూ భాగస్వాములవ్వాలని కోరారు.



# పేదవాడి కల సాకారమవుతోంది

## ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ.. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని మొత్తం 126 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలోనే పేదవానికి సొంతింటి కల నెరవేరుతుందని, ఇది నిజమైన ప్రజా ప్రభుత్వం, ఇందిరమ్మ ప్రభుత్వమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేదవారికి ఐదు లక్షల రూపాయల ఆర్థికసహాయం అందిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు కేవలం మాటలకే పరిమితమైందని, పేదవాడికి ఒక్క ఇంటి సౌకర్యం కూడా కల్పించలేదని విమర్శించారు. మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పేదవాడి సొంతింటి కల సాకారం అవుతోందన్నారు. అర్హులందరికీ విడతల వారీగా ఇండ్లు మంజూరు అవుతాయని, ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు. నియోజకవర్గానికి ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, అదనంగా మరో 1000 ఇండ్లు కేటాయించేందుకు రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేయగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఆమోదించారని ఎమ్మెల్యే తెలిపారు. లబ్ధిదారుల ఖాతాల్లో నాలుగు విడతలుగా ఐదు లక్షల రూపాయలు జమ అవుతాయని చెప్పారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పలు పథకాలను అమలు చేస్తోందని వివరించారు. రైతుబంధు, రైతుభరోసా, రుణమాఫీ, ఉచిత కరెంటు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచడం వంటి పథకాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రత్యేకతలని పేర్కొన్నారు. పినపాక నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్ల రూపాయల నిధులు సమీకరించామన్నారు. సిసి రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, హాస్పటల్ సిబ్బంది భర్తీ, రెండు ఏఐటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్)ల స్థాపన, మణుగూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల ప్రారంభం తదితర అంశాలను ఈ సందర్భంగా వివరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులతో పాటు ముఖ్యమంత్రితో కలిసి పినపాక అభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి శ్రీనివాసరావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, డీటీ రామారావు, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మహిళా అధ్యక్షురాలు సౌజన్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, మైనారిటీ అధ్యక్షులు రహీం పాషా, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, గాండ్ల సురేష్, అనుబంధ సంఘాల నాయకులు, ప్రభుత్వ అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సింగరేణి జేవీఆర్ గనిని సందర్శించిన పర్యావరణ, అటవీ శాఖ సభ్యులు



**సత్తుపల్లి, మహా:** పట్టణ పరిధిలోని జలగం వెంగళరావు, కిష్టారం సింగరేణి ఉపరితల గనులను పర్యావరణ,అటవీ శాఖల సభ్యులు ప్రొఫెసర్" ఆర్.ఎం బట్టచార్జ్జ(ఎం.ఓ.ఈ. ఎఫ్ & సీ.సీ) సింగరేణి పర్యావరణ జనరల్ మేనేజర్ సైదులు, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజు తో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జే.వి.యర్ ఉపరితల గని అధికారులకు పలు సూచనలు సలహాలు అందించారు.గని నిర్వహణలో కాలుష్య నివారణకు మొక్కల పెంపకం,బొగ్గు దుమారం లేవకుండా నీళ్లను వెదజల్లడం వంటి చర్యలను పర్యావరణ అధికారి ప్రశంసిస్తూ సంతృప్తిని వ్యక్తం చేశారు.రాబోవు రోజుల్లో కూడా కాలుష్యాన్ని నివారించి గని పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు.గని పరిశీలనలో బట్టచార్జ్జీ తో పాటు జే.వి.ఆర్ గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.వి.ఆర్ ప్రహ్లాద్, ఎస్.ఓ.టు.జి.ఎం కోటిరెడ్డి,ఎస్.ఓ.యం రాజేశ్వరరావు,కళ్యాణ్ రామ్, ఎన్విరాన్మెంట్ కార్పొరేట్ రవికిరణ్, పి.సత్యనారాయణ ఉన్నారు.

## దోమకాటు వ్యాధుల నివారణకు పరీక్షలు



**ముదిగొండ అక్టోబర్ 22 మహా:** మండలంలోని వల్లభి, ముదిగొండ పిహెచ్సిల ఆధ్వర్యంలో మండల పరిధిలో గోకినేపల్లి, అయ్యగారిపల్లి, పెద్దమండవ గ్రామాలలో దోమకాటుకు బోదకాలు (ఫైలేరియా) నివారణపై సర్వేలో భాగంగా,బోదకాలు నిర్ధారణ రాపిడ్ టెస్ట్ కిట్ స్ట్రీప్ వైద్యపరీక్షలు బుధవారం నిర్వహించారు.జిల్లా వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు గుర్తించబడ్డ ఇండ్ల కుటుంబసభ్యులు 315 మందికి వైద్య పరీక్షలు చేయించమని ముదిగొండ,వల్లభి పిహెచ్సిల వైద్యాధికారులు అంకం అరుణాదేవి,కందిబండ ధర్మేంద్ర చెప్పారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా,పుట్టకుండా నివారణకు తగు జాగ్రత్తలు తీసుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.దోమకాటు నివారణపై వారు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్స్ రెడ్డిబోయిన రామారావు,సురేష్,సిహెచ్ఓ మధుసూదన్ రావు, సూపర్వైజర్స్ లత,పద్మావతి,రవి,ఎంఎల్హెచ్పిలు ఆలకుంట దేవేందర్,ప్రవీణ్, డబ్ల్యూహెచ్ఓ మానిటర్ ఝాన్సీ,ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## మండల క్రీడల ఛాంపియన్ బాణాపురం పాఠశాల



**ముదిగొండ, మహా:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ముదిగొండ 2025–26 మండల స్థాయి క్రీడా పోటీలు వెంకటాపురం సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఈనెల 17,18 తేదీల్లో నిర్వహించారు. మండలంలోని ఈక్రీడల్లో 14 పాఠశాలకు చెందిన క్రీడా జట్లు పాల్గొన్నారు.జడ్పిహెచ్ఎస్ బాణాపురం పాఠశాల విద్యార్థులు కబడ్డీ,ఖో–ఖో,వాలీబాల్ క్రీడల్లో పాల్గొని అత్యంత ప్రతిభ చూపి 08 విభాగాల్లో పతకాలు సాధించి ముదిగొండ మండల క్రీడల ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచింది.

1.సినియర్ గర్ల్స్ ఖో –ఖో – విన్నర్.
2.సీనియర్ గర్ల్స్,వాలీబాల్ – విన్నర్.
3.జూనియర్ గర్ల్స్,ఖో–ఖో–రన్నర్.
4.జూనియర్ గర్ల్స్,వాలీబాల్ – విన్నర్.
5.జూనియర్ బాయ్స్,ఖో–ఖో– రన్నర్.
6.జూనియర్ బాయ్స్,వాలీబాల్ – విన్నర్.
7.సీనియర్ బాయ్స్,ఖో–ఖో– విన్నర్,
8.సీనియర్ బాయ్స్,వాలీబాల్ – రన్నర్.

బుధవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ముదిగొండ సబ్ ఇన్స్పెక్టర్ హరిత ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.ఈకార్యక్రమంలో క్రీడలకు కన్వీనర్ ఇ వెంకటరామిరెడ్డి,క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ (పి.డి),మండల పీడీలు పాల్గొన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఇవి రామిరెడ్డి. నవతెలంగాణ ముదిగొండ.నిత్య సాధన,ఉత్తమ క్రీడా శిక్షణ,క్రమశిక్షణతో 2018 నుండి నేటి వరకు,క్రీడా పోటీల్లో తమ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారని బాణాపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఇవిరామిరెడ్డి అన్నారు.ఈఏడాది మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి బుధవారం ఆయన మాట్లాడారు.ప్రతి సంవత్సరం మండల స్థాయి క్రీడా పోటీల్లో చాంపియన్లుగా నిలుస్తున్న క్రీడాకారులను ఆయన అభినందించారు.

## రైతు సంఘం నేత మూడు శోభన్‌కు మాతృ వియోగం



**కారేపల్లి, మహా:** తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్ కు మాతృ వియోగం కలిగింది. శోభన్ స్వగ్రామం కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి లో తల్లి మూడ్ జమ్లి(65) నివసిస్తుంది. మంగళవారం రాత్రి గుండెపోటు రావడంతో ఆమె మృతి చెందారు. జమ్లి కి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు మూడ్ శోభన్ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సీపీఎం హెూల్ టైమర్ గా హైదరాబాదులో పనిచేస్తున్నారు. రెండో కుమారుడు మూడ్ మోహన్ దేవదాయ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా చిన్న కుమారుడు రవి గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రిషన్ గా పనిచేస్తున్నారు. జమ్లి మృతి విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) రాష్ట్ర, జిల్లా నేతలు బుధవారం మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. శోభన్ రాష్ట్ర నేతగా ఎదగటంలో తల్లి జమ్లి తోడ్పాటు ఎంతో ఉంది.

## వ్యవసాయ యంత్రాలకు దరఖాస్తులు స్వీకరణ



**ముదిగొండ, మహా:** సబ్సిడీపై ఇచ్చే వ్యవసాయ యంత్రాలకు రైతులు దరఖాస్తులు చేసుకో వాలని ఏవో ఎస్ సరిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపా రు.యాంత్రికరణ పథకం కింద 2025 –26 సంవత్సరానికి మాన్యువల్ స్ప్రేయర్లు 230,పవర్ స్ప్రేర్లు 32,పవర్ టిల్లర్లు 1,బ్రష్ కట్టర్లు 2,పవర్ ఫీడర్ 1,రోటవేటర్ లపై ఆసక్తి ఉన్న రైతులు ఈనెల 24వ తేదీ వరకు ముదిగొండ వ్యవసాయ అధికారి కార్యాలయం నందు దరఖాస్తులు చేసుకోవచ్చునని ఆమె పేర్కొన్నారు. చిన్న,సన్నకారు రైతులతోపాటు,ఎస్సీ,ఎస్టీ, మహిళా రైతులకు 50% సబ్సిడీ,పెద్ద రైతులకు 40 శాతం సబ్సిడీలో ఇవ్వబడునని ఆమె చెప్పారు. దరఖాస్తు చేసుకునే రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుబుక్కు మూడు,మూడు జిరాక్సులతోపాటు, మూడు పాస్ ఫోటోలు దరఖాస్తు ఫామ్ కు జతపరచాలని ఏవో ఎస్ సరిత చెప్పారు.

## ప్రభుత్వ కాలేజీల సమస్యలు పరిష్కరించాలి



**నేలకొండపల్లి, మహా :** ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినేపల్లి మస్తాన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం సంఘం సమావేశం ను నిర్వహించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం ను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...స్థానిక కాలేజీ ప్రహరీగోడ ను నిర్మించాలని కోరారు. ఖాళీగా ఉన్న అధ్యాపకులు పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం లో మెనూను అమలు చేయాలని కోరారు. పెండింగ్ లో ఉన్న ఉపకార వేతనాలు ను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

## బాలికలతో ఉపాధ్యాయుడు అసభ్య ప్రవర్తన

**కూసుమంచి, మహా:** ఉపాధ్యాయుడు అంటే దేవునితో సమానంగా సంభోదిస్తాం.. తండ్రి తరువాత స్థానం గురువుదే.. విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పాల్సిన ఓ గురువు చిల్లర పనులు చేశాడు. పిల్లి కండ్లు మూసుకొని పాలు తాకుతూ నన్నేవ్వరు చూడటం లోదనుకుంటుందన్నట్లు ఈ కీచక గురువు చేసే వక్ర బుద్ది పనులు ఎవరికి తెలియదు అనుకున్నాడు.. సమాజాన్ని నిద్ర లేపి, సమసమాజంలో వంకర పనులను బయటకు తీసే నాల్గొవ స్థంబం నుంచి తప్పించుకోలేననే విషయాన్ని ఆ కీచక గురువు మర్చిపోయినట్లు ఉన్నాడు. ఆయన గారు చేసే చిలిపి, చిల్లర పనులను మీడియా బయటపెట్టింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేయగా, ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే కూసుమంచి మండలం నర్సింహులగూడెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన జీ వీరయ్య పాఠశాల విద్యార్థినీలకు విద్యాబోధన చేయకుండా, తాకరాని చోట తాకుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఉండే వాడు. అయినప్పటికీ గురువు అనే ఆలోచనతో కీచక ఉపాధ్యాయుని పై విద్యార్థులు ఫిర్యాదు చేయలేదు. అయినప్పటికీ అలాగే కొనసాగుతుండటంతో వికృత చేష్టలతో విద్యార్థినీల పై లైంగిక వేధింపులకు పాల్పడిన విషయం పలు పత్రికలలో ప్రచురితం చేయడం జరిగింది. విచారణ చేపట్టిన మండల విద్యాశాఖ అధికారి జిల్లా అధికారులకు విచారణ అంశాలు తెలపగా తీవ్రంగా పరిగణించిన జిల్లా విద్యాశాఖ అధికారిణి డాక్టర్ శ్రీజ విచారించి వెంటనే సదరు ఉపాధ్యాయుడు పై సస్పెన్షన్ వేటు వేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూసుమంచి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా విచారించిన కూసుమంచి ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లితండ్రులు, సామాజిక కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. కీచక ఉపాధ్యాయుడన్ని విధుల నుంచి పూర్తిగా తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఉచిత మెగా కంటి వైద్య శిబిరం




**కొత్తగూడెం టౌన్, మహా:** లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం, వికాస తరంగిణి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కంటి పరీక్ష వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరాన్ని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రారంభించి ప్రసంగించారు. స్వచ్ఛంద సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటారని ముఖ్యంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం వికాస తరంగాణి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల నిర్వహణ పరీక్షల అనంతరం ఉచితంగా ఆపరేషన్లు జరపడం అభినందనీయమని శరత్ మాక్సివిజన్ హాస్పిటల్ యాజమాన్యానికి సిబ్బందికి అభినందనలు తెలియజేస్తూ రానున్న రోజుల్లో మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో ఇంకా సేవలందించాలని సూచించారు.

## చైతన్యం - డ్రగ్స్ పై యుద్ధం



**అశ్వారావుపేట, మహా :** మాదకద్రవ్యాల నిర్మూలన కోసం అశ్వారావుపేట పోలీసులు చైతన్య కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. నెల రోజుల పాటు చైతన్యం – డ్రగ్స్ పై యుద్ధం పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం అశ్వారావుపేట మండలంలోని వి.కె.డి.వి.ఎస్. రాజు డిగ్రీ కళాశాలలో అశ్వారావుపేట ఎస్ఐ కె.అఖిల, సిబ్బంది విద్యార్థులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు యువతపై చూపే దుష్ప్రభావాలపై వివరించారు. యువత మత్తు పదార్థాల బారిన పడితే వ్యక్తిగత జీవితం మాత్రమే కాదు కుటుంబం, సమాజం కూడా దెబ్బతింటుందని చెప్పారు. అందుకే ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల వ్యసనాన్ని నిరోధించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వద్ద ట్రాఫిక్ క్రమబద్దీకరణ




**ఖమ్మం , మహా:** నగరంలోని బైపాస్ రోడ్డు సమీపంలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వద్ద ధాన్యం లారీలు రహదారి ఇరువైపులా నిలపడంతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడి స్కూల్ బస్సులు, ఆటోలు,పాదచారులు, ద్విచక్ర వాహనాలు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు నియంత్రణ చర్యలు చెపట్టారని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. లారీల వల్ల వాహనాలు కదలలేని పరిస్థితి నెలకొందని పలువురు ఫిర్యాదు చేయడంతో లారీలను రోడ్లపై పెట్టకుండా చర్యలు తీసుకున్నారు.

# మా కార్యకర్తలపై దాడి చేస్తే సహించం

## బీజేపీని తక్కువ అంచనా వేస్తే క్షమించం

### కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్ డ్రామా ఆపాలి

### బిజెపి రాష్ట్ర నాయకులు మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్ ఘాటు వ్యాఖ్యలు



**ఖమ్మం, మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ నాయకులు భారతీయ జనతా పార్టీని (బీజేపీ) తక్కువ అంచనా వేస్తే క్షమించేది లేదని, మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకులు సీతారాం నాయక్ హెచ్చరించారు. "మా కార్యకర్తల వైపు వేలు చూపిస్తే, ఆ వేలు తీసేస్తాం ఖబర్దార్" అంటూ ఆయన కాంగ్రెస్ పార్టీకి వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం నాడు బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల బీసీ బంధు సందర్భంగా సత్తుపల్లిలో బీజేపీ కార్యకర్తలపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. "మా కార్యకర్తల వైపు వేలు చూపించే వాళ్ల వేలు తీసేస్తాం ఖబర్దార్!" అంటూ హెచ్చరించారు.

"జిల్లాలో బీజేపీ బలపడుతోందని కొంతమంది భయపడి మా నాయకులపై దాడులు చేస్తున్నారు. దీనిపై మేము పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌కి వినతిపత్రం అందజేశాం. బీజేపీ కార్యకర్తలు గాయపడినా, బాధ్యులపై కేసులు నమోదు కాలేదు. ఇది ప్రజాస్వామ్యానికి అవమానం" అని ఆయన అన్నారు. సీపీ సునీల్ దత్ గారికి మంచి పేరు ఉందని, దానిని నిలబెట్టుకుని న్యాయం చేయాలని కోరారు. మా కార్యకర్తలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన తప్పదని హెచ్చరించారు. "బీజేపీ జాతీయ స్థాయి క్రమశిక్షణ గల సంస్థ. కార్యకర్తలపై భౌతిక దాడి చేయడం నేరం. మా సహనం పెద్దది కానీ, దానికి పరిమితి ఉంది. పోలీసులు సత్వర చర్యలు తీసుకోవాలి" అని ఆయన అన్నారు. అదేవిధంగా, "బీసీ రిజర్వేషన్ డ్రామా ఆపాలి" అని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 5 ఎస్టీ నియోజకవర్గాలు ఉంటే, ఎస్సీలకు మాత్రం మూడు మాత్రమే ఉన్నాయని, ఈ అసమానతలపై పోరాడటం మానేసి, కాంగ్రెస్ నేతలు ఇతర ముసుగులు వేసుకుంటున్నారని విమర్శించారు. "ఓసీ మంత్రులు నిజంగా సామాజిక న్యాయం నమ్మితే వెంటనే రాజీనామా చేసి బీసీలకు అవకాశం ఇవ్వాలి" అని ఆయన సవాలు విసిరారు. "ఉత్తర తెలంగాణకు కాంగ్రెస్ ఏం ఇచ్చిందో చెప్పాలి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఇప్పుడున్న మంత్రుల పాత్ర ఏమిటో ప్రజలకు స్పష్టంగా చెప్పాలి. కులబలం, ధనబలం ఉన్నవాళ్ళ బీసీలను అణగదొక్కుతున్నారు. ఇది ఇక జరగనివ్వం" అని తీవ్ర విమర్శలు చేశారు. సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆత్మకూరు కాంతి కిరణ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంగామల్ల ఆనంద గౌడ్, రాష్ట్ర నాయకులు గెంటెల విద్యాసాగర్, ఈ వి రమేష్, నంబూరి రామలింగేశ్వరరావు, నున్న రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు, గుత్త వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు రవి రాథోడ్, వీరవెల్లి రాజేష్, ఎన్ బెనర్జీ, మందడపు సుబ్బారావు, జ్వాల నరసింహారావు, ఆర్ వి ఎస్ యాదవ్, కే సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రాలు బలమైన వేదికలు కావాలి



**భద్రాద్రి బ్యూరో, మహా:** పిల్లల్లో ఆత్మవిశ్వాసం క్రమశిక్షణ విలువలతో కూడిన విద్య అందించాలని భవిత కేంద్రాలు పిల్లల మానసిక శారీరక వికాసానికి బలమైన వేదికలు కావాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. బుధవారం కొత్తగూడెం బాబు క్యాంపు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ హై స్కూల్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి పలు అంశాలను సమీక్షించారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల బోధనా విధానాలు, పాఠశాలలో లభ్యమవుతున్న సౌకర్యాలు, డిజిటల్ క్లాస్ రూమ్‌ల వినియోగం, స్మార్ట్ బోర్డుల ద్వారా పాఠ్యాంశ బోధన విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారు నేర్చుకుంటున్న విషయాలు, తమ భవిష్యత్తు లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. పదవ తరగతి గదిలోకి వెళ్లి ఆ సమయంలో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ టీవీలను ఉపయోగిస్తున్నారా వీటి ద్వారా పాఠ్యాంశాలు బోధిస్తున్న తీరు ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఖాన్ అకాడమీలో విద్యార్థులను రిజిస్టర్ చేశారని ప్రధానోపాధ్యాయులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం కింద ప్రతి పాఠశాలను ఉత్తమ ప్రమాణాలతో అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, ఈ పాఠశాలలు భవిష్యత్తులో దేశానికి మార్గదర్శకులుగా నిలిచే విద్యార్థులను తయారు చేయాలన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి చర్యలు



**ఖమ్మం,మహా:** మధిర నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి పకడ్బందీ కార్యాచరణ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డా. యోగితా రాణా అన్నారు. విద్యాశాఖ కార్యదర్శి, విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తో కలిసి హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మధిర నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధి పై సమీక్షించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా విద్యా శాఖ అధికారిణి డా. పి. శ్రీజ తో కలిసి క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ, మధిర నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధి కి కార్యాచరణ చేయాలన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ లర్ని%శీ%ాగ్ ల్యాబ్ ల ప్రారంభానికి చర్యలు చేపట్టాలన్నారు.

# కొండరెడ్ల గ్రామాభివృద్ధికి ఐటిడిఎపివో రాహుల్ కృషి

## పూసుకుంట గ్రామంలో పి.వో సమీక్ష సమావేశం

## తేనెటీగల పెంపకానికి అవసరమైన మౌలిక సామాగ్రి పంపిణీ

**దమ్మపేట ,మహా :** మండల పరిదిలోని పూసుకుంట కొండ రెడ్ల గ్రామాలలోని గిరిజన కుటుంబాలకు జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఐటీడీఏ ద్వారా సరఫరా చేసిన టిల్లర్లు తేనెటీగల పెంపకం సంబంధించిన బాక్సులు సక్రమంగా సద్వినియోగం చేసుకొని గ్రామం అభివృద్ధికి కావలసిన మౌలిక వసతుల కల్పనకు చేయూత అందిస్తామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. బుధవారం దమ్మపేట మండలం పూసుకుంట గ్రామంలో కొండ రెడ్ల గిరిజన కుటుంబాల జీవనోపాధికి చేపట్టవలసిన కార్యాచరణ ,మౌలిక వసతులు కల్పించడానికి అవసరమైన వివిధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంత గిరిజన యువత, రైతులు, గ్రామస్తులు గ్రామంలోని సౌకర్యాల కల్పనకు ముందుకు రావడంతో వారి జీవనోపాధికి టెల్లర్ మిషన్లు, టెంట్ హౌస్ లు, భూమి ఉన్న 14 మంది రైతులకు బోరు మోటార్లు అందజేయడం జరిగిందని తెలిపారు.అందులో ముఖ్యంగా ఆయిల్ ఫామ్ వేసుకొని అంతర్ పంటలుగా వివిధ రకాల కూరగాయల పంటలు వేసుకుంటే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని అన్నారు.భూమిలేని రైతులు ఇంటి పక్కన ఉన్న పెరడులో ఈజీఎస్ ద్వారా పుట్టగొడుగుల పెంపకం , పశువులకు పనికొచ్చే గడ్డి , గేదెలు ,మేకలు ,గొర్రెల పెంపకం ద్వారా డైరీ ఫార్మ్ లో ఏర్పాటు చేసుకొని జీవించవచ్చని అన్నారు. గిరిజనులకు కావలసింది విద్య ,వైద్యం ,వ్యవసాయం పరంగా ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి బాధ్యతగా చేసుకుంటే తప్పనిసరిగా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని తెలిపారు.మీకు ఏ రంగంలో మక్కువ ఉందో దానికి సంబంధించిన అంశాలు మా దృష్టికి తీసుకొని రావాలని తప్పనిసరిగా మీకు వెసులుబాటు కల్పించి అభివృద్ధి దిశగా తీసుకొని పోతామని కొండరెడ్లకు సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లు 25 మందికి మంజూరు అయినందున త్వరలో వాటి నిర్మాణం చేపడతామని, పామాయిల్ పంటలు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు ఎవరికైతే పామ్ ఆయిల్ మొక్కలు అవసరం పడతాయో ఇంటింటికి తిరిగి వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి తప్పనిసరిగా వారి పొలాలలో పామాయిల్ పంటలను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. వాటితో పాటుగా అంతర్ పంటలైన కూరగాయలు ,మునగ సాగు వంటి పంటలు వేసుకునే విధంగా హార్టికల్చర్ అధికారి,వ్యవసాయ అధికారి, గ్రామ సెక్రెటరీ తప్పనిసరిగా వారికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. తేనెటీగల పెంపకం పై ఆసక్తి ఉన్నవారు ముందుకు వస్తే 25 మందికి తప్పనిసరిగా తేనెటీగల యూనిట్లు అందిస్తామని, తేనెటీగల పెంపకం ద్వారా కూడా ఉపాధి పొందవచ్చని అన్నారు. వెదురుతో గృహ అవసరాలకు తయారు చేస్తున్న ఇతర కళాఖండాలు ,సామానులు తయారు చేసుకొని ఐటీడీఏకు అందిస్తే వాటి అమ్మకానికి వెసులుబాటు కల్పిస్తామని అన్నారు. గ్రామంలో విద్యుత్ సౌకర్యం ,పిండి మర, ఇస్తరాకుల తయారీ యూనిట్, నాటు కోళ్ల పెంపకం ఇటుకల తయారీ యూనిట్ కావాలని గ్రామస్తులు కోరగా తప్పనిసరిగా అందిస్తానని, కానీ వాటిని సద్వినియోగం చేసుకొని జీవనోపాధి పెంపొందించుకోవాలని అన్నారు. సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, తహశీల్దార్ భగవత్ రెడ్డి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, డిఇ బాపనయ్య, జేడీఎం హరికృష్ణ, ఉద్యానవన అధికారి కిషోర్, వ్యవసాయ శాఖ అధికారి కేశవరావు, సెరికల్చర్ నరేందర్, హెచ్ ఓ సాయ కృష్ణ, సిడిపిఓ హేమసత్య, ఈజీఎస్ ఏపీవో సుదర్శన్ రావు,ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## డ్రగ్స్ నిషేదంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**దమ్మపేట ,అక్టోబర్ 22 మహా :** డగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని ,అందుకోసం పోలీసులు మండలంలో నెల రోజుల పాటు వివిధ గ్రామాల్లో శిభిరాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు పట్టణ పరిదిలో ఉన్న గిరిజన బాలుర సంక్షేమ పాఠశాల విద్యార్దులకు బుధవారం అవగాహన కల్పించారు. ఎస్ ఐ సాయికిషోర్ రెడ్డి ,అడిషనల్ ఎసై బాలస్వామి ఆద్వర్యంలో విద్యార్థుల కు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలకు నేటి యువత బానిసలుగా మారొద్దని ,గంజాయి అమ్మకాలపై ,రవాణా పై ఆచూకి తెలిసినట్లైతే పోలీసులకు సమాచారాన్ని అందించాలని తెలిపారు. విద్యార్ది దశలో చక్కగా చదువుపై శ్రద్ధ కనబరచి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని విద్యార్దులకు సూచించారు. ఇంటి వద్ద ఉన్న తల్లిదండ్రులకు ,బంధు మిత్రులకు కూడా గంజాయి వంటి మత్తుపదార్దాలను నిషేదించమని తెలియజేయాలని విద్యార్థులను కోరారు. నేటి యువతరం రేపటి బావితరాలకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్దులచే డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మింపజేస్తామంటూ నినాదాలు చేయించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**కారేపల్లి, మహా :** రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైరా ఎమ్మెల్యే మలోత్ రాందాస్ నాయక్ , ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం సింగరేణి మండలం అప్పాయ్యగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ లక్ష్మీ ప్రియ కోటెక్స్ జిన్నింగ్ మిల్ లో సెంట్రల్ కాటన్ కార్పొరేషన్ (సిసిఐ) ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి రైతులు నష్టపోకుండా కేంద్రం నిర్ణయించిన మద్దతు ధరకు సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు జరుగుతుందని తెలిపారు. రైతులు ఎవరూ దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, నేరుగా సిసిఐ కేంద్రాలకు పత్తి తీసుకురావాలని సూచించారు.సిసిఐ కేంద్రాల ద్వారా పారదర్శకంగా కొనుగోలు జరగడం రైతులకు నమ్మకం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ఏడీఏ కరుణశ్రీ, ఏఈఓలు , సిసిఐ ప్రతినిధులు, ఇల్లందు మార్కెట్ చైర్మన్ రాంబాబు, ఏఎంసీ కార్యదర్శి నరేష్, సూపర్వైజర్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## ఆదివాసీ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

**దమ్మపేట, మహా:** ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం ఆదివాసీలు ఐక్యంగా పోరాడాలని రాష్ట్ర ఆదివాసీ సంక్షేమ పరిషత్ కార్యదర్శి కొర్సా వెంకటేష్ దొర పిలుపునిచ్చారు. బుధవారం కొమరం భీమ్ జయంతి సందర్బంగా పట్టణంలోని కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల ను ఆనాడే గుర్తించి పోరాటం జరిపిన వీరుడని అన్నారు. భీమ్ స్ఫూర్తితో ప్రతి ఆదివాసీ బిడ్డ పోరాడాలని కోరారు. కార్యక్రమంలో కుర్సం చిన్నరాజు ,ఊకే రాంబాబు ,పెనుబల్లి రమేష్ , తదితరులు పాల్గొన్నారు.



# స్కూల్స్ అభివృద్ధికి పక్కా ప్రణాళిక: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం,మహా:** తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అభివృద్ధికి పక్కా ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మధిర మండలం మహదేవపురం జెడ్పిహెచ్ఎస్, చింతకాని మండలం నాగులవంచ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ గా అభివృద్ధి చేసేందుకు పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేసిన పాఠశాలల హెడ్ మాస్టర్ లు వెంటనే పాఠశాల అభివృద్ధి నిర్వహణ కమిటీ పేరిట ప్రత్యేక బ్యాంక్ ఖాతా ప్రారంభించాలని, దీనికి లీడ్ బ్యాంకు మేనేజర్ అవసరమైన సహకారం అందించాలని అన్నారు. ఖమ్మం సమగ్ర శిక్ష ఫైనాన్స్ అకౌంట్ ఆఫీసర్ డెమో ప్రాజెక్ట్ స్కూల్




ఎడ్యుకేషన్ పేరిట కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఉపయోగించే విధంగా జాయింట్ బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయాలని అన్నారు. నూతనంగా వచ్చిన 7 కోట్ల 18 లక్షల రూపాయలను డెమో ప్రాజెక్టు స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ బ్యాంక్ అకౌంట్ లో జమ చేసేందుకు ప్లానింగ్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని కలెక్టర్ ముఖ్య ప్రణాళిక అధికారిని ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో ఉన్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ లను సమగ్ర శిక్ష అభియాన్ ప్లానింగ్ కోఆర్డినేటర్, మండల విద్యాశాఖ అధికారులు సంబంధిత పాఠశాలల హెడ్ మాస్టర్ లు అక్టోబర్ నెలలో క్షేత్రస్థాయిలో పర్యటించి స్టడి చేయాలని అన్నారు.